# మా సీత పట్నం కాపురం

అందంగా, ఆనందంగా అపురూపంగా అల్లారుముద్దుగా ఆఖరి అమ్మాయిగా పల్లెలో పెరిగిన సీతకి, పెరట్లో జామచెట్లు పూల మొక్కలూ మధ్యన అమాయకంగా పెరిగిన సీతకి అన్నీ సరదాలే.

తల్లి దగ్గర సంగీతం, తండ్రి దగ్గర సంస్కృతం నేర్చుకుంది. ఇంగ్లీషు చదువులన్నా పట్నంలో ఉండడమన్నా ఎంతో కోరిక. అది కనిపెట్టే సీత తండ్రి ఇంగ్లీషు చదువున్న పట్నంలో ఉద్యోగం చేస్తున్న సుందరాంగుణ్ణి తీసుకువచ్చి పెళ్ళి చేసారు.

అత్తవారింటికి వెళ్ళేటప్పుడు- పెరట్లో ఆవుదూడా, తను సరదాగా కట్టుకున్న బొమ్మరిల్లూ, గొబ్బిళ్ళ పేరంటం బొమ్మల కొలువు, నిత్యమూ సాయంత్రం దేవాలయానికి వెళ్ళి ఇష్ట దైవాన్ని ఆరాధిస్తూ కూడా వచ్చిన స్నేహితులు చెలోక్తులతో ఏది కట్టుకున్నా 'ఈ రంగు నీకు బాగుంది' అని పొగిడే స్నేహితుల్ని వదిలి, అత్తవారింటికి వెళ్ళడమంటే, కష్టమే మరి, ఆ తల్లిదండ్రులకు కూడా, సీత వెళితే ఇల్లు చిన్నబోతుంది, మనసు చిన్నబోతుంది మరి, అయినా ఎదిగిన ఆడపిల్ల, ఓ అయ్య చేతిలో పెడితేనే అందం కదా?

"రామాలయంలో రోజూ దీపం పెట్టి వాకిట్లో ముగ్గు పెట్టిరా మంచి మొగుడు వస్తాడ"ని అమ్మ రోజూ దీవించేది. నాన్నగారైతే, భాగవతంలో రుక్మిణీ కళ్యాణం, ప్రహ్లాద చరిత్ర, కృష్ణుడు చెలికాండ్రతో చద్దులు ఆరగించుట తన చేత చదివించి, వంటావార్పూ శుచి శుభ్రత అన్నీ నేర్చుకుని క్షణం తీరిక లేకుండా పెరిగిన సీత పతియే ప్రత్యక్ష దైవంగా ప్రేమించడం మొదలెట్టింది. దాంతో, ఆ భర్తగారు అనబడే పురుష పుంగవుడు చాలా దర్పంగా మెలగడం మొదలెట్టాడు.

"పోసుకుందుకు నీళ్ళు పెట్టావా? ఈ కాఫీ ఇలా ఉందేం? ఈ కూర బాగాలేదు తీసెయ్యి" అంటూ అహంతో మాట్లాడేవాడు. పతిని మెప్పించాలనే ధ్యాసేగాని తనని చాలా చిన్నచూపు చూస్తున్నాడనేది గమనించలేదామె, భర్తమీద విపరీతమైన వ్యామోహం వల్ల.

పేరు మోహనరావు బాగానే ఉంది.కాని ఇంటికి వస్తున్నాడంటే భయం, ఏం వంకలు పెడతాడో అని. ఓ చిరునవ్వు ఓ లాలింపూ లేదు. విచ్చీ విచ్చని మల్లెపూలు వాడకుండా

దగ్గరికి రావడం లేదు. ఏ రాత్రో నిద్రమత్తులో ఉండగా ఆ పని కాస్తా కానిచ్చేసుకుని వెళ్ళిపోతాడు.

'నీ కాపురం ఎలా ఉందే' అని అడిగితే 'ఓ దారీ తెన్నూ లేదు సరదా చట్టుబండలూ లేదు.' అని చెప్దామనుకుంటుంది. మళ్ళీ సంసారం గుట్టుగా ఉండాలని అమ్మ చెప్పిన మాట అక్షరాలా పాటిస్తుంది సీత.

మోహనరావు కొత్తగా కాపురం పెట్టడంతోనే అతనిభర్తలేని అక్కగారు సీతతో వచ్చారు. 'భర్తలేని ఆమెని తీసుకుని మొదట కాపురం పెట్టకూడదు' అంది అమ్మ.

అది తప్పు అనిపించలేదు. పాపం వాళ్ళ తమ్ముడి మీద ఆశలు ఆమెకుండవూ? అన్నింటికీ ఆ దేవుడే ఉన్నాడు అనుకుంది సీత. పట్నంలో చూసిన ఇల్లుగలామెకి కూడా భర్త లేడు. 'ఇదేం పాపమే' అంది అమ్మ. అది అంతేలే అని తల్లి మాటని కాదని భర్తని సమర్థించింది సీత.

ఇంక ఇంటామె సంగతేమిటంటే, భర్తలేకపోయినా ఉన్నట్లు అనుకుంటుంది. పెందరాళే వంటచేసి వెండికంచం పెట్టి పీట వేసి దాని మీద రాగితో చుట్టిన రుద్రాక్షలు పెట్టి తన కంచం పక్కన పెట్టుకుని అన్నీ వడ్డించుకుని భర్త కంచంలో అన్నం వడ్డించి దేవుడికి నమస్కరించి తను తింటూ మీకు కొంచెం వెయ్యనా అంటూ పలకరిస్తూ భోంచేసి ఆయనకని వడ్డించినవన్నీ పెరట్లో కాకులకు పెడుతుంది. ఓ పిల్లిని పెంచుకుంది దాంతో మాట్లాడేది పిల్లలతో మాట్లాడినట్లుగాను.

సీత ఇదంతా గమనించేది, ఇంట్లో పనైపోయాక పడక గది తలుపు తీసి ఇంటామె హాల్లోకి వెళ్ళేది కబుర్లకోసం. ఎంతో ప్రేమగా మాట్లాడేది సీతతోనూ.

ఓ రోజున తలారా స్నానం చేసి తనకిష్టమైన చీర కట్టుకుని సీత నిలుచుంటే చూసి వచ్చేసి ముద్దు పెట్టుకుని "ఎంత బాగున్నావే, సీతా ఇలారా" అంటూ తీసుకువెళ్ళి బీరువాలోని తన నగలన్నీ తీసి పెట్టింది. "ఎంత బాగున్నావో చూసుకో. అద్దంలో అచ్చు సీతమ్మవారిలాగున్నావు" అంది. సాయంకాలం నాలుగు అయినా నగలు తీసెయ్యదు, సీతని కదలనివ్వదు. సాయంకాలం అయింది. అప్పటికి వదిలింది ఆమె. ఆడబిడ్డ అయ్యాయా పెత్తనాలు అంటూ కోప్పడినా సీత సమాధానం చెప్పలేదు. నిజమే కదా మరి. భర్త మోహనరావుకి ఇంట్లోకి సరుకులు తేవడమంటే చాలా చిరాకు పడతాడు. పావలా జీలకర్ర, అర్ధకిలో కందిపప్పు తెస్తాడు. ఏ సాయంకాలానికోను.

అవి పొట్లం విప్పి చూసి ఏడుస్తూ కూచుంటుంది సీత. చిన్నప్పుడు పుట్టింట్లో కందులు మినుగులు, పంట వడ్లు ఇంట్లో దంపించేది అమ్మ. అన్నీ జ్ఞాపకం వచ్చాయి. కళ్ళు తుడుచుకుంది. బియ్యం మరీ పది కిలోలు తేవడం, అయిపోయాయని చెప్పడానికి భయం.' అప్పుడే అయిపోయాయా?' అని ఒక్క అరుపు అరిచి విసవిసా వీధిలోకి వెళ్ళిపోవడం, ఆ సరుకులు తెస్తాడో లేడో తెలియదు. నోరుమూసుకుని ఉండడం నేర్చుకుంది.

ఓ సినిమా లేదు ఓ షికారు లేదు. ఎప్పుడూ ఆఫీసులో పని, పని అంటూ స్నేహితులింటికి వెళ్ళి రాత్రి భోజనాల వేళకి రావడం అప్పుడు ఓ పక్క ఆవలింతలు వచ్చేస్తూంటే అన్ని యేంతింటాం కబుర్లు ఏం చెప్పుకుంటాం అని చిన్నప్పుడు కృష్ణశతకంలో పద్యాలు చదువుకుంటూ పడుకోడం అలవాటైయింది.

ఇలా జరుగుతున్న కాపురంలో ఒక రోజున ఇంటి గల బామ్మగారు వచ్చి 'ఇంటి అద్దె పెంచండి లేదా ఇల్లు ఖాళీ చేయండి' అని ఖచ్చితంగా చెప్పేసింది. ఆ రాత్రి భోజనాలు అయ్యాక ఇల్లు కడుగుతుంటే బిందివార పాము పిల్ల కనిపించింది, దాంతో దడవచ్చి పక్కవాటాలోకి తలుపు తీసుకుని పరుగెట్టింది సీత. 'ఆ పాము పిల్లకి భయమేమిటి పెరడంతా తుడిపించాను కదా? అందువల్ల అలా రావడం మామూలే అది ఎలా వచ్చిందో అలా పోతుందిలే" అంది ఇంటామె.

సీతకి ఆ ఇల్లు ఖాళీ చేసేదాకా నిద్ర పట్టలేదు పట్నం కాపురం ఇలా ఉంటుంది, ఇంగ్లీషు చదువుకున్న మొగుడు ఇంత సరసుడని అన్నీ ఇప్పుడిప్పుడే అర్థం అవుతోంది.

"ఏమిటీ? ఆవిడ నగలన్నీ పెట్టుకు తిరుగుతున్నావుట సీతా! అస్తమానం వీధి అరుగుమీద నుంచుంటున్నావుట. ఎదురు ఇంటి డాక్టర్ ఎర్రగా ఉన్నాడనా?" అన్నాడు మోహనరావు. ఆ మాటలకి పౌరుషం వచ్చి "నగలు పెట్టవద్దన్నా పెడుతోంది. రెండోది నిజం కాదు. అది మీ భ్రమ" అంది సీత. తన భార్య సీతేనా ఇంత ఘాటుగా మాట్లాడుతోంది అని ఆశ్చర్యపోయాడు. అక్కడి నుంచి వెళ్ళిపోయాడు విసుగ్గా ముఖం చిట్లించుకుంటూ.

మొత్తంమీద ఒక ఇల్లు అద్దెకి దొరికింది. ఒకరోజున, ఆడబడుచు పెద్దగా ఏడుస్తూంటే ఎందుకు ఏడుస్తున్నారు? అని ఊరుకోబెట్టబోయింది.

"నా కూతుర్ని నా తమ్ముడికిచ్చి పెళ్ళి చేసుకుందామనుకున్నాను. నా కూతురు

పోయింది ఆ స్థానంలో నువ్వు వచ్చావే'' అంది.

"ఏడవకండి నేను కాకపోతే ఎవరో ఒకర్ని పెళ్ళి చేసుకుందురు కదా?'' అంది.

"ఈ సీత పేరు పెట్టిన వారికి గీత బాగుండదు. అరణ్య రోదనంలా ఉంటుంది బ్రతుకంతాను.'' అంది. దాంతో పోనీలే బాధపడకూడదు అని సర్దుకుంది.

ఆ ఇంట్లోకి వచ్చిన వేళ మంచిదై, ఒక కొడుకు పుట్టాడు. మళ్ళీ కడుపుతో ఉంది. అది చూడలేక, సీత ఆడబడుచు వెళ్ళిపోయింది ఇంకో తమ్ముడి దగ్గరికి.

ఒక రోజున ఇంటాయన వచ్చి "రెండు మూడేళ్ళయింది మీరు ఈ ఇంటికి వచ్చి. అద్దె పెంచండి లేదా ఇల్లు ఖాళీ చెయ్యండి'' అన్నాడు.

దాంతో చిన్నతనంలో సొంత ఇల్లు అలవాటు ఏమో ఈ అద్దె ఇళ్ళూ అగచాట్లూ కొత్తగా ఉన్నాయి.

"ఏమైనా సరే ఇల్లు ఖాళీ చేస్తాను కాని, అద్దె పెంచను'' అని అరిచాడు మోహనరావు.

"అయితే సరే, ఇల్లు ఖాళీ చెయ్యండి'' అని చెప్పి వెళ్ళి పోయాడు.

"ఇదేం పట్నం బ్రతుకులోరా భగవంతుడా'' అంది సీత మళ్ళీ ఇల్లు మారడం అంటే భయపడి.

"అయితే నీ పుట్టింటికి పో'' అన్నాడు.

"వాళ్ళు పెళ్ళి చేసి మీకు కట్టబెట్టారు కదా? మళ్ళీ వెనక్కి వెళ్ళే ప్రసక్తే లేదు. మీరు ఎక్కడ ఉంటే అక్కడే నా బ్రతుకు వెళ్ళమారుస్తాను'' అని ఖచ్చితంగా చెప్పేసింది సీత. "ఇదేం పెళ్ళాంరోయి, మాటలు రామబాణాల్లాగా వదులుతోంది'' అని కొంచెం విసుక్కున్నాడు.

"ఏమైనా మీకు నేను నాకు మీరు తప్పరు, ఇంతే ఈ అనుబంధం'' అని మెల్లగా సన్నాయి నొక్కులు నొక్కింది.

దాంతో మోహన రావు, మళ్ళీ ఇల్లు వెతకడం మొదలెట్టాడు.

ఆఖరికి ఊరు చివర నాలుగు గదుల ఇల్లు దొరికింది. ఇల్లు చూసివచ్చింది సీత. ఆ ఇంట్లోకి వెడుతుంటే, ఏదో భయంగా ఉంది, పెరడంతా గడ్డి మొలచింది, వాడుతున్న ఇల్లులాగా, పూల మొక్కలూ తులసి తోట, పళ్ళమొక్కలూ లేవు.

ఇంటామెని వెళ్ళి పలకరించింది. ఏడుస్తూ చెప్పింది. "ఒక్కగానొక్క కూతురు పోయింది. ఆ వాటా అద్దెకిస్తే కాస్త బెంగ తగ్గుతుందని'' అంది. "మేము పెద్ద వాళ్ళం అయ్యాం

కదా కాస్త పని సాయం వంట సాయం ఉంటుందనీ" అంది.

ఆ మాట విన్న సీత, "ఓరి దేవుడోయి పతిదేవుడోయి ఇలాంటి ఇల్లు చూసారేంటి?" అంది సీత.

"అది అంతే, ఇప్పుడే అడ్వాన్సు కూడా ఇచ్చేసాను. మంచి రోజు చూసుకుని వచ్చి ఇంట్లో చేరదాం" అన్నాడు.

ఏడుస్తూ అడిగింది. ఇంతకన్నా మంచి ఇల్లు ఇంకొకటి చూసుకుందామని. ససేమిరా వీల్లేదు అన్నాడు మోహనరావు. ఆ వేళల్లా ఏడుస్తూ అన్నం తినలేదు.

"ఇప్పటికే ఓ పిల్లాడు ఒళ్ళోను, ఇంకో పిల్లాడు కడుపులోనూ ఉన్నాడు. ఆ ఇంటికి మనం వెళ్ళకూడదు" అని అన్నం పెడుతూ భర్తకి చెప్పింది సీత.

"ఎవరు చెప్పారు నీకు?" అని గద్దించి అడిగాడు మోహనరావు.

"నా మనసే చెప్పింది. పెద్ద దిక్కుగా ఉన్న మీవాళ్ళు కూడా లేరు. మీరు ఆఫీసుకి వెడితే ఒంటరిగా ఉండలేను. నా మనసు సంకోచిస్తుంది"అని అరిచింది సీత.

"నువ్వు అరిస్తే భయపడేవాణ్ణికాను. ఆ ఇంట్లోకి అద్దెకి వెళ్ళవలసిందేను" అన్నాడు.

"నేను ఆ ఇంట్లోకి రాను, ఆఖరికి మీరు ఏ పూరిల్లు చూసినా సంతోషంగా సీతమ్మవారి వర్ణశాలలా ఉందని ఆనందంగా ఉంటాను అంతే కాని ఆ ఇంట్లోకి రాను" అని గట్టిగానే అరిచింది.

ఒకరికొకరు పట్టుదలలు పెరిగాయి, మాట్లాడుకోవటం లేదు ఆ దంపతులు ఇద్దరూను. పచ్చగడ్డివేస్తే భగ్గుమంటోంది. యాంత్రికంగా అయిపోయారు.

ఓ రోజున మోహనరావుని వాళ్ళ స్నేహితుడు 'అలావున్నావేమిరా?' అని అడిగాడు. మోహనరావు తన బాధ అంతా చెప్పుకున్నాడు.

"పల్లెటూరు పిల్ల ఏదో అమాయకంగా కంచం దగ్గిరా, మంచం దగ్గిరా చెప్పినట్టు వింటుంది అనుకున్నాను కాని ఇలా చెప్పినట్లు వినదని అనుకోలేదు. అసలు అది కార్యంనాడే నాకు కొన్ని షరతులు పెట్టింది. కొన్నాళ్ళు ప్రేమించుకున్నాక, అప్పుడు మన కలయిక అని దగ్గరకి వారం రోజులు రానియ్యలేదురా."

అంతా విన్న స్నేహితుడు పక పక నవ్వి "భార్యాభర్తలంటే, ఒకరు చెప్పినదాన్ని మరి ఒకరు అర్థం చేసుకోవాలిరా? ఇలా ప్రతి దానికీ నామాటే నెగ్గాలి అని పట్టు పట్టకూడదు. ఆడవాళ్ళకి ఏవో కోరికలు ఉంటాయి, అవి మనం తీర్చడంలోనే ఆనందం తెచ్చుకోవాలి"

అని ధైర్యం చెప్పి "ఇంతకీ ఆ ఇంట్లోకి రానంటుంది. అయినా రోజంతా ఇంట్లో ఉండేది ఆ అమ్మాయి, నువ్వు కాదు కదా? అందువల్ల ఆమెకి ఇష్టంలేందే వెళ్ళకు. ఆ తర్వాత ఏదేనా అపశృతి జరిగితే, నువ్వే ఏడవాలి" అని నచ్చచెప్పాడు.

మోహనరావుకి-ఫ్రెండుకదా అని తనకష్టం చెప్పుకుంటే, తన భార్యవైపు నుంచి మాట్లాడతాడేమిటి? వీడు మరీ పెళ్ళాం చేతిలో కీలుబొమ్మ అని ఓ చెలోక్తి వేసుకుని మనసు సరిపెట్టుకున్నాడు.

'సీత సంగతి నే చెపుతాను, ఆ ఇంటికంటే, పూరిల్లు నయమంటుందా? దీనికి నిజంగా పూరిల్లు చూసి, ఆ ఇంట్లో కాపురం పెడతాను చూస్కో' అని, శపథం చేసాడు. శపథం చూసి సీత ఏం భయపడలేదు. సరే చూడండి అని కోపంతో మిట మిట లాడింది. అది చూసి మోహనరావు చిటపటలాడాడు.

ఈ పరిస్థితిలో ఆఫీసులో కొలీగ్సువచ్చి ఓరోజు ఒకరు మరోరోజు ఇంకొకరు చొప్పున ఎలాగైనా అయింట్లోకి వెళ్ళడం మంచిది కాదు సీతగారు చెప్పినట్లు అని చెప్పారు. దాంతో, "నా ఆఫీసులో వాళ్ళందరి చేత చెప్పిస్తున్నావా?" అన్నాడు.

" రామ, రామ నేనే పాపం ఎరగనండీ. మీకు ఎవరు చెప్పారు అని అడిగి తెలుసుకోండి నన్ను నానా మాటలు అనకండి" అంది కళ్ళ నీళ్ళు పెట్టుకుంటూను.

తీరా ఆరాతీసి అడిగితే తను ఏ స్నేహితుని సలహా అడిగాడో వాడే ఆఫీసు అంతా టామ్ టామ్ చేసాడని తెలిసింది మోహనరావుకి.

మొత్తంమీద వెతికి వెతికి పట్టుకున్నాడు ఒక పూరిల్లు. పైగా చుట్టూ మేడలు పెంకుటిల్లు మధ్యలో పూరిల్లు. ఎవరో పేదవాడు, టీచరుట రెండు గదుల్లో తనుండి రెండు గదులు అద్దెకి ఇస్తున్నాడు అని తెలిస్తే సీతని తీసుకువెళ్ళి చూసించాడు.

అర్ధాంగీకారంతో బిక్క మొహం వేసి తనకేసి ప్రాధేయపూర్వకంగా చూస్తుందని ఆశించాడు మోహనరావు. అదేంలేదు.

" ఏవండీ ఆ మాష్టారు, భార్య పార్వతీ పరమేశ్వర్లులాగా ఉన్నారు. పెరట్లో పూలమొక్కలూ తులసి మొక్కలూ పెరడంతా పెట్టిన ముగ్గులూ చూస్తుంటే నాకు మనసు సంతోషంతో నిండిపోయింది. ఆ ఎదురింటి మేడ నా చిన్నప్పటి స్నేహితురాలి అత్తవారిల్లు. నన్ను ఎన్నాళ్లకి చూసాను అని మురిసి పోయింది" అంది.

అది విన్న మోహనరావు"సరే పద ఆ ఇంట్లోకి. చూద్దాం" అన్నాడు గర్వంగా మీసం

దువ్వుతూను.
"మేము ఇల్లు మారుతున్నాం" అని రాసిన ఉత్తరం చూసి పిల్లలతో ఎల్లా ఉన్నారు అని, మోహనరావు తండ్రి వచ్చాడు. సంగతంతా సీత చెప్పింది. మోహనరావు ఆఫీసునుంచి రాగానే తండ్రి వచ్చినందుకు కొంచెం మొహం విసుగ్గా పెట్టాడు. సీత సంగతులు అన్ని చెప్పేసి ఉంటుంది అనుకున్నాడు,
"నువు ఇల్లు మారుతున్నావని లెటరు రాసావు కదా? పిల్లలు ఎలా ఉన్నారో చూసిరండని మీ అమ్మ గొడవ పెడితేను వచ్చాను" అన్నాడు మోహనరావు తండ్రి.
సీతని అనవసరంగా అనుకున్నాను. అని కొంచెం జాలేసింది, నిజంగా పాక చూసినందుకు మోహనరావుకు.
"రేపు నువ్వు వెళ్ళబోయే ఇల్లు చూసి వచ్చాను. మట్టి ఇల్లూ పాకాను. రాత్రిళ్ళ మండ్రకప్పలు మట్టి దొలుచుకు వస్తాయిట. నీకిదేం బుద్ధిరా అలాంటి ఇల్లు చూసావు డబ్బులు సరిపోటం లేదంటే, ఏ బియ్యంమూటో లారీలో వేసి పంపిస్తాను.అంతేకానీ, అలాంటి ఇంట్లో సీతనీ, పిల్లల్నీ పెట్టకు" అన్నారు.
"అదికాదు నాన్నా! సీత సరదాపడింది వర్ణశాలలోలా ఉంటుంది, అలాంటి ఇల్లు చూడండి అని" అన్నాడు కొంచెం భయపడుతూను.
"మీరు ఈ ఇంట్లోనే ఉండండి, డబ్బులు చాలకపోతే నేను పంపిస్తాను."
"ఇప్పుడు ఇంతిల్లెందుకు మేము ఇద్దరం చంటిపిల్లాడు కదా?"
"మరి రేపు పుట్టబోయే బిడ్డ సంగతో? పెద్దవాళ్ళం మేము ఎవరో ఒకరం వస్తూ ఉంటాం వెర్రి వెర్రి వేషాలు వెయ్యక, సరిగా ఉండు" అన్నాడు అతని తండ్రి.
"మరి ఇల్లు రేపు కాళీ చేస్తానని చెప్పి అద్దె ఇచ్చేసాను. అదేం కుదరదు. వెళతాం అన్నాక వెళ్ళకపోతే బాగుండదు నాన్నా!" అని అరిచాడు మోహనరావు.
"ఎంతో అల్లారుముద్దుగా పెంచిన సీతని, కావాలని, మనింట్లో ఇచ్చారు. వాళ్లేమో సుఖపడుతోందని సంతోషిస్తున్నారు. నువ్వేమో ఇలా ఉన్నావు" అన్నారు.
మొత్తం మీద పూరింట్లోకి వెళ్ళకుండా, ఉన్న ఇంట్లోనే ఉండిపోయారు సీతా, మోహనరావు.
"చివరికి నువ్వే నెగ్గావు " అని సీతకేసి ఈర్ష్యగా చూసాడు మోహనరావు.
అది గమనించిన సీత, భర్తతో, "పతి దేవుడూ! అద్దె ఇల్లు అగచాట్లు నేను పడలేను.

తొందరలో ఓ ఇల్లు కట్టుకుందాం" అంది,

"అమ్మ పల్లెటూరు సీతా, సొంత ఇంటికి టెండర్ పెట్టావా!" అన్నాడు మోహనరావు.

"మంచి సంకల్పాలు ఉండాలి. అవి తప్పక తీరుతాయి" అంది సీత నవ్వుతూను.

"ఏమెట్టి కడతావే ఇల్లు?" అన్నాడు.

" ఆ ఏముంది నా నగలు బేంక్‌లో పెట్టి లోన్ తీసుకోండి. స్థలం కొనండి ఎల్.ఐ.సి లోను తీసుకోండి, చాలకపోతే ఆఫీసులోన్ తీసుకోండి, మనం నెల, నెలా అద్దె కట్టేది లోన్ తీరిపోతుంది, మనకా సొంత ఇంట్లో ఉన్న ఆనందం ఉంటుంది" అంది సీత.

"నీ ప్లాను బాగానే ఉంది, కాని కొంచెం సవరణ మనింట్లో పక్క వాటా అద్దెకిస్తే అప్పులు తొందరగా తీర్చేయవచ్చును కదా?" అన్నాడు.

"నాపతి దేవుడూ! సొంత ఇంటి సుఖం ప్రత్యేకంగా ఉంటేనే. బాగుంటుంది. మళ్ళీ అద్దె ఇల్లు అగచాట్లు కొత్తవి. అవి బాగు చేయించండీ ఇవి బాగు చేయించండీ అంటూ కొత్త నస, అందుచేత హాయిగా పూల మొక్కలు, పండ్ల మొక్కలు వేసుకుని, సొంత ఇంట్లో ఉందాం" అంది సీత.

కొందరి ఆలోచనలు అనుకున్నవి అనుకున్నట్లు తీరే అదృష్టం ఉంటుంది అదీ. సీత మనసు గొప్పది కనుక, సొంత ఇల్లు అమరింది. అద్దె ఇంటి అగచాట్లు తప్పింది. పతిదేవుడికి సీతంటే దేవతలా గోచరించింది.

❄❄❄

(అముద్రితం 2004)